సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



'గురు'తర బాధ్యత

హెచ్ఎం వీరాంజనేయులు తన సొంత నిధులతో పాఠశాలను ఆధునికీకరించి, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

8లో



విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో హెచ్చరించారు.

8లో



సిరులతల్లికి పూజలు

డాబాగార్డెన్స్ : శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు, తులసీదళార్చన నిర్వహించారు.

ప్రాణదాతల ఆగ్రహం..

వైద్య సేవలు బంద్

నిత్యం స్వచ్ఛమైన చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ... అందరూ ఆరోగ్యంగా ఉండాలని అహర్నిశలు సేవలందించే వైద్య లోకం భగ్గుమంది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అందోళనలు చేసింది. దీంతో ఆస్పత్రుల్లో వైద్య సేవలు బంద్ అయ్యాయి. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో రక్షణ చట్టం తెచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

- జిల్లావ్యాప్తంగా నిలిచిపోయిన సాధారణ వైద్యసేవలు
- అత్యవసర సేవలకు మినహాయింపు
- పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఘటనపై భగ్గుమన్న వైద్యులు
- మరోవైపు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు నిరసనలు



ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీగా వెళుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు



వడ్డాదిలో ప్రైవేట్ వైద్యుల ర్యాలీ



నర్సీపట్నం అబీద్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు తప్ప మిగిలిన వైద్యసేవలు బంద్ అయ్యాయి. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా వైద్య సంఘాల పిలుపు మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. జిల్లాలో ఒక వైపు వైద్యులు, వైద్యసిబ్బంది..మరో వైపు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఆ మృగాలను కేంద్ర ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ వైద్యసేవలన్నీ నిలిచిపోయాయి. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఆస్పత్రుల్లో ఓపీలను నిలిపివేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎమర్జెన్సీ సేవలు మినహా అన్ని సేవలు బంద్ అయ్యాయి. అనకాపల్లి వైద్యాలయంలో 15 మంది జూనియర్ వైద్యులు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 11 మంది జూనియర్‌వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు.వీరితో పాటుగా ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పతులకు వచ్చిన రోగులు పలు ఇబ్బందులు గురయ్యారు. కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. ఐఎంఏ మెడికల్ అసోసియేషన్ నర్సీపట్నం విభాగం వైద్యులు ఆందోళన చేశారు. అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలను బంద్ చేశారు. దీంతో వైద్య సేవలు స్తంభించాయి. ప్రైవేటు వైద్యులు ప్లేకార్డులు పట్టుకొని ఐఎంఏ అసోసియేషన్ భవనం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలియజేశారు. కళాశాలల ఆవరణలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు.

న్యూస్‌రీల్

సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ దంపతులు



జేకే మహేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దినేష్‌కుమార్, విజయ కృష్ణన్ దంపతులు

సాక్షి,పాడేరు: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జే.కే. మహేశ్వరిని అల్లూరి,అనకాపల్లి కలెక్టర్లు దినేష్ కుమార్, విజయకృష్ణన్ దంపతులు శనివారం అరకులోయలో మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి వారు పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యార్థినుల్లో రక్త హీనత లేకుండా చర్యలు

- జిల్లా టాస్క్‌ఫోర్స్ విజిట్ అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

గొలుగొండ: విద్యార్థినుల్లో రక్తహీనత లేకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ విజిట్ అధికారులు డాక్టర్ లూసీ, డీపీవో జగదీష్, డీపీహెచ్ఎన్ నాగమణి తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు గొలుగొండ పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. ముందుగా గ్రామ సచివాలయంలో ఏఎన్ఎం అందించే వైద్య సేవల రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థినుల రక్తహీనత రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ విద్యార్థినుల్లో రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారం, ఆరోగ్య విషయాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇక్కడ రోగులకు అందించే సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్యామ్, సీహెచ్‌వో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

20న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం

తాటిచెట్లపాలెం(విశాఖ): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి విశాఖ రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

విశాఖ రేంజ్ పరిధిలో 52 మంది సీఐల బదిలీ

- వీరిలో వీఆర్‌కు 17 మంది సీఐలు
- వీఆర్‌లో ఉన్న 10 మందికి పోస్టింగ్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 52 మంది సీఐలకు బదిలీలు జరిగాయి. ఇందులో వీఆర్‌కు 17 మంది వెళ్లగా..వీఆర్‌లో ఉన్న 10 మంది సీఐల కు పోస్టింగ్ కల్పించారు. ఈ మేరకు శనివారం డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లాలో పనిచేసే 17 మంది సీఐలను రేంజ్ పరిధిలో వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. వివిధ జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు 13 మంది సీఐలను బదిలీ చేశారు. కశింకోట సీఐగా అల్లు స్వామి నాయుడు, అనకాపల్లి ఎస్‌బీ సీఐగా కె.లక్ష్మణమూర్తి, అనకాపల్లి ట్రాఫిక్ సీఐగా ఎం.వెంకట నారాయణ, అనకాపల్లి ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ సీఐ గా ఆర్.వి.వి.ఎస్.ఎస్.సీ.హెచ్ శేఖర్‌రావు బదిలీపై వచ్చారు. అనకాపల్లి జిల్లాలో పనిచేసిన రాంబిల్లి సీఐ ఎస్.లక్ష్మణరావును వీఆర్‌కు, నక్కపల్లి సీఐ విజయ కుమార్‌ను శ్రీకాకుళం టెక్కలికి, సైబర్ సెల్ సీఐ కుమార్ స్వామిని నక్కపల్లికి, కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడును వీఆర్‌కు, అనకాపల్లి రూరల్ సీఐ ఎస్.ధనుంజయ్ రావును యలమంచిలికి, యలమంచిలిలో పనిచేసే సీఐ గఫూర్‌ను వీఆర్‌కు, పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజును చోడవరానికి, చోడవరం సీఐ బమ్మిడి శ్రీనివాసరావును వీఆర్‌కు, అనకాపల్లి టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్ర శేఖర్‌ను వీఆర్‌కు, కశింకోట సీఐ వినోద్ బాబును వీఆర్‌కు, అనకాపల్లి ఎస్‌బీ సీఐ అప్పలనాయుడును అనకాపల్లి సీసీఎస్‌కు, అక్కడ సీసీఎస్ సీఐ నీలయ్యను వీఆర్‌కు, అనకాపల్లి టౌన్ సీఐ జి.శంకర్‌రావును విజయనగరానికి, నర్సీపట్నం రూరల్ సీఐ హరిని పార్వతీపురం మన్యం జిల్లాకు, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పైడపునాయుడును వీఆర్ కు బదిలీ చేశారు.

అదేవిధంగా అల్లూరి జిల్లాలో జీకే వీధి సీఐగా పనిచేసే బి.అప్పలనాయుడును పార్వతీపురం జిల్లా సాలూరుకు, సాలూరు టౌన్ సీఐ చింటా వాసునాయుడును అల్లూరి జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా, వీఆర్‌లో ఉన్న హెచ్.మల్లేశ్వరరావును అల్లూరి జిల్లా డీసీఆర్‌బీ సీఐగా, అదేవిధంగా వీఆర్‌లో ఉన్న బి.అప్పలనాయుడును అల్లూరి ఎస్‌బీ సీఐగా, అక్కడ పనిచేసే హిమగిరిని అరకు సీఐగా బదిలీ చేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



చోడవరంలో వరి నాట్లు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

చోడవరం: రైతులు సాగుచేస్తున్న పంటలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. చోడవరం మార్కెట్‌యార్డులో అగ్రిల్యాబ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ల్యాబ్‌లో పంటల పరీక్షల విధానం, సిబ్బంది పనితీరు, యంత్రపరికరాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసే పంటలను తప్పని సరిగా ఈపంటలో నమోదు చేయించుకోవాలన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టబోయే వ్యవసాయ పథకాలను ఆయన వివరించారు. అనంతరం చోడవరం, బుచ్చెయ్యపేట మండలా లకు చెందిన వ్యవసాయాధికారులు, ఫీల్డ్ సిబ్బందితో ఆయన సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో చోడవరం వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు రవీంద్రనాథ్, మండల వ్యవసాయాధికారులు ఇ.పావని, ఎంఈవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నవరం ప్రాంతంలో ఖరీఫ్ వరి నాట్ల ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

ఈఎన్‌సీలో స్టాఫ్ అర్ధ వార్షిక సమావేశం



నేవీ కమాండ్ స్టాఫ్ అర్ధ వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింథియా: తూర్పు నావికా దళ కమాండ్ శక్తి, సామర్థ్యాలను మరింత పెంచే దిశగా శనివారం స్టాఫ్ అర్ధ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షత వహించగా.. కమాండ్‌లోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కమాండ్ పురోగతిని విస్తృతంగా సమీక్షించడంతో పాటు కమాండ్ సామర్థ్యాలను పెంచే మార్గాలపై చర్చించారు. వాటిని అమలు చేయడంపై దృష్టి సారించినట్లు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్ పూండి-నౌపడ-పూండి, తిలారు-కొటబొమ్మాళి సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఈనెల 22, 24వ తేదీల్లో ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 21న పుదుచ్చేరిలో రాత్రి 6.50 గంటలకు బయల్దేరాల్సిన పుదుచ్చేరి-భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు బయల్దేరుతుంది. ఈ నెల 21, 23వ తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూరులో మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10గంటలకు బయల్దేరుతుంది.





రాంబిల్లి మండలం వాడనర్సాపురంలో కూటమి నేతలను చెదరగొడుతున్న పోలీసులు (ఇన్‌సెట్) బూరుగుపాలెం పాఠశాల వద్ద బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్ఎంసీ ఎన్నికల్లో 'పచ్చ'పాతం

సరస్వతీ నిలయాలను కూటమి నేతలు తమ రాజకీయాలకు నెలవుగా మార్చారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తమ మద్దతుదారుల్ని గెలిపించుకునేందుకు ప్రధానోపాధ్యాయులతో ప్రలోభాలకు తెరతీశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఏకపక్షంగా గెలిచేందుకు అవకాశమున్న చోట అసలు ఎన్నికలే జరగనీయకుండా అడ్డుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రేక్షకపాత్రే వహించారు.

- కూటమి నేతలకు అనుకూలంగా హెచ్ఎంలు
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలిచే చోట ఎన్నికలు వాయిదా
- పలు ప్రాంతాల్లో భారీగా డబ్బు, మద్యం పంపిణీ
- వాడనర్సింగపల్లిలో సాక్షి విలేకరిపై కూటమి నేతల దాడి



కైలాసపట్నంలో అధికారుల తీరుపై మండిపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అనకాపల్లి/సాక్షి నెట్‌వర్క్: రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి నేతలు బరి తెగించారు. స్థానిక ఎన్నికలను తలపించే కుట్రలకు తెరలేపారు. వివాదాలకు దూరంగా జరగాల్సిన ఎన్నికల్లో, వివాదాలనే అస్త్రంగా మలచుకుని తమవారిని నెగ్గించుకునేందుకు అడ్డదారులు తొక్కారు. అధికారులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన తల్లిదండ్రులు పోటీలోనే లేకుండా ఓట్లను గల్లంతు చేశారు. కూటమి నేతల దౌర్జన్యాల పోలీసులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రేక్షకులుగా మారారు.

- మాకవరపాలెం మండలం బూరుగుపాలెం ప్రభుత్వ పాఠశాలలో రెండుసార్లు డైరెక్టర్ల ఎన్నిక జరిపినా.. తమ వారు గెలవలేదని మూడోసారి ఎన్నికకు టీడీపీ నేతలు పట్టుబట్టారు. వైఎస్సార్‌సీపీ మద్దతు తల్లిదండ్రులు గెలిచారని హెచ్ఎంపై ఒత్తిడి తీసుకొచ్చారు. వాయిదాకు కుయుక్తులు పన్నారు. ఇక్కడ 21 మంది డైరెక్టర్లకు గాను 13 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే తల్లిదండ్రులు ఎన్నుకున్నారు.
- యలమంచిలి మండలం ఏటికొప్పాక మేజర్ పంచాయతీలోని ప్రభుత్వ హైస్కూల్లో ముందుగా 6, 7, 8 తరగతులకు ఒక్కో తరగతికి సభ్యులను ఎన్నుకున్నారు. ఆ తర్వాత 9, 10 తరగతుల సభ్యులను ఎన్నుకునేందుకు సరిపడా 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకాలేదు. దీంతో ఎన్నిక నిర్వహించడం లేదని హెచ్ఎం సూర్యనారాయణ చెప్పడంతో, వైఎస్సార్‌సీపీ నేతలు బయటకు వచ్చేశారు. వారు బయటకు వెళ్లాక టీడీపీ మద్దతుదారులు ఎన్నికైనట్లు ప్రకటించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సేనాపతి రాము హెచ్ఎంను నిలదీస్తే మధ్యాహ్నం 1 గంట దాటాక కోరం సరిపోవడంతో ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు. దీనిపై యలమంచిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.
- కొత్తలి, లక్కవరం, పురుషోత్తపురం, సోమలింగపాలెం, పులపర్తి, యలమంచిలి పట్టణంలోని స్కూళ్లలో టీడీపీ, జనసేన నాయకులు తమ మద్దతుదారులనే కమిటీల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. కొన్ని చోట్ల కోరం లేకపోయినా కూటమి పార్టీలకు అనుకూలంగా ఇళ్లకు వెళ్లి సంతకాలు తీసుకుని మరీ అడ్డదారుల్లో ఎన్నికలు జరిపారు.
- చీడికాడలోని జేవీపురం పంచాయతీ పరిధి వరహాపురం ఎన్నికల్లో హైడ్రామా నడిచింది. మొత్తం 24 డైరెక్టర్ పదవులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన తల్లిదండ్రులే క్లీన్‌స్వీప్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కుమారుడి ద్వారా హెచ్ఎంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు.

సాక్షి విలేకరిపై దౌర్జన్యం

రాంబిల్లి మండలంలో వాడనర్సాపురంలో వైఎస్సార్‌సీపీ మద్దతు తల్లిదండ్రులు విజయం సాధించడంతో ఎన్నికల వాయిదాకు హెచ్ఎంపై కూటమి నేతలు ఒత్తిడి తీసుకొచ్చారు. ఇది తెలిసిన సాక్షి విలేకరి ఫొటోలు తీస్తుండగా కూటమి నేతలు దాడికి యత్నించారు. సాక్షి పేపర్లో జరిగింది రాస్తే అంతు తేలుస్తాం, మర్యాదగా ఫొటోలు డిలీట్ చేసి వెళ్లు.. అంటూ బెదిరించారు. దాడికి ఎగబడ్డారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. రాంబిల్లి సీఐ నర్సింగరావుకు ఫిర్యాదు చేయడంతో, ఆయన వచ్చి కూటమి నేతలకు సర్దిచెప్పారు. వినని వారిపై లాఠీ చార్జ్ చేయడంతో వారంతా పరారయ్యారు.

- వెంకటాపురం ఎంపీయూపీ స్కూల్ కమిటీ ఎన్నికలో జనసేన, టీడీపీ మద్దతుదారులు పరస్పర విమర్శలకు పాల్పడ్డారు. తల్లిదండ్రుల్ని ప్రలోభాలకు గురిచేసి, రహస్య ప్రాంతాలకు తరలించి, ఎన్నికలకు తీసుకొస్తున్నారని ఒకరిపై ఒకరు దాడులకు ఎగబడ్డారు.
- కోటవురట్ల మండలం కైలాసపట్నం ఎంపీపీ స్కూల్లో 25 మంది డైరెక్టర్లకు గానూ 18 మంది వైఎస్సార్‌సీపీ మద్దతు పేరెంట్స్ ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ నేతలు హెచ్ఎంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎన్నికలను వాయిదా వేయించారు.
- మునగపాక మండలం తోటాడ జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ పదవి కోసం బీజేపీ, జనసేన నాయకులు పోటీపడ్డారు.

ప్రశాంతంగానే ఎన్నికలు : డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి జిల్లాలో 1464 ప్రభుత్వ పాఠశాలకు గాను 1416 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయని, మిగిలిన 34 పాఠశాలల్లో వివిధ కారణాలు వల్ల ఎన్నికలు వాయిదా వేసినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసి 144 సెక్షన్ విధించామన్నారు. వాయిదా పడిన చోట ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక మ్యాప్
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా వెల్లడి



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

మహారాణిపేట(విశాఖ): ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వర్గీకరణతో కూడిన ప్రత్యేక మ్యాప్ తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కాలువలు ఉండే ప్రాంతాల్లో ఒకటికి రెండు సార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఆయన తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ రెవెన్యూ విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఏ, డి.నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీహోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పీఎంల రూపకల్పన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల డిజిటైలేజేషన్ ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుకునే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉండే భూములను వర్గీకరిస్తూ రెవెన్యూ, జీవీఎంసీ రెవెన్యూ విభాగం కలిసి మ్యాప్ రూపొందించాలని, ఒక్క రకం భూమికి ఒక్కో రకం రంగు చూపించే మ్యాప్ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వాటిని జీపీఎస్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలన్నారు. రికార్డుల తయారీలో రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ విభాగం, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయం వహించాలని, అందరి వద్దా ఒకేలాంటి రికార్డు ఉండేలా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో 3డి మ్యాపింగ్ రూపొందించాలని, వీలుంటే ఏఈ టెక్నాలజీ సహాయం తీసుకోవాలని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి

22ఏలో చేస్తున్న ప్రక్రియలకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అర్బన్ ల్యాండ్ విభాగం రూపొందిస్తున్న రికార్డుల వివరాల్లో తారతమ్యం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని తేల్చి చెప్పారు. దేవాదాయ భూముల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. కాలువలు, చెరువులు, నీటి బావుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని కట్టడాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, సీతారాం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'బీఐఎస్' హెల్మెట్లే వినియోగించాలి



జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి మనోహర్

తుమ్మపాల: జిల్లాలో ద్విచక్ర వాహనదారులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) గుర్తింపు ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి జి.మనోహర్ తెలిపారు. బీఐఎస్ హెల్మెట్లు చట్టబద్ధమైవి, సురక్షితమైనవని ఆయన చెప్పారు. బీఐఎస్ స్టాండర్డ్స్ లేని హెల్మెట్లను విక్రయించే దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపే వారిని గుర్తించి హెల్మెట్ వినియోగం పై అవగాహన కల్పించడంతో పాటు, జరిమానాలను విధిస్తామన్నారు. వాహనదారుల్లో రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఆగివున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

- తెలంగాణ వాసి దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు


మృతుడు శరత్‌కుమార్

అనకాపల్లి: ఆగివున్న ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో శనివారం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చందానగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పి.శరత్‌కుమార్(24) దుర్మరణం చెందగా, మరో ఉద్యోగి మలుగు జిల్లాకు చెందిన మొగిలి రమ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమె విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పట్టణ ఎస్‌ఐ ప్రసాద్ వివరాల మేరకు... తెలంగాణకు చెందిన ఐదురుగు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైదరాబాద్ నుంచి విశాఖకు రైల్లో శుక్రవారం వచ్చారు. ఇక్కడ రెండు ద్విచక్ర వాహనాలు అద్దెకు తీసుకున్నారు. పి.శరత్‌కుమార్, రమ్య ఒక ద్విచక్రవాహనంపైన, మరో ముగ్గురు వేరొక ద్విచక్రవాహనంపై విశాఖ నుంచి అరకు వెళ్లేందుకు అనకాపల్లి మీదుగా రాత్రిపూట పయనమయ్యారు. ముగ్గురు యువకులు హైవేలో అనకాపల్లి పట్టణానికి వచ్చే సర్వీస్ రోడ్డును గమనించకుండా నేరుగా బ్రిడ్జిపైకి వెళ్లిపోయారు. వీరికోసం శరత్‌కుమార్, రమ్య సర్వీస్ రోడ్డులో ఆగిపోయారు. వెనక్కి రావాలని తన స్నేహితుడు ప్రమోద్‌శర్మకు ఫోన్ చేశారు. అదే సమయంలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో శరత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో రమ్య ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తోటి స్నేహితుడు ప్రమోద్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నేడు నీతి ఆయోగ్ సభ్యుడి రాక

మహారాణిపేట: నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సరస్వత్ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 6 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. 19న రుషికొండలో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు తిరిగి ఢిల్లీ వెళతారు.


మురుగు, మూత్రశాలల మరమ్మతులతోపాటు కల్పించిన రన్నింగ్ వాటర్ సౌకర్యం


బలహీనమైన శ్లాబ్‌కు రూఫింగ్ చేయిస్తున్న హెచ్‌ఎం వీరాంజనేయులు


ప్రహరీ స్థానంలో సొంత నగదుతో ఏర్పాటు చేసిన సిమెంట్ పోల్స్

'గురు'తర బాధ్యత

- రూ.2.50 లక్షలు వెచ్చించి పాఠశాల మరమ్మతులు
- బడి ఆవరణలో ఆకుకూరల పెంపకం
- రూపురేఖలు మార్చిన హెచ్‌ఎం వీరాంజనేయులు


ఏకరూపు దుస్తులను విద్యార్థులకు అందిస్తున్న హెచ్‌ఎం వీరాంజనేయులు


సుందరంగా ముస్తాబైన పాచిలవానిపాలెం పాఠశాల భవనం


ఏకరూప దుస్తులతో హాజరవుతున్న విద్యార్థులు

కె.కోటపాడు: విద్యార్థులకు పాఠశాలే దేవాలయం ... దీన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దితే చదువుపై వారికి ఏకాగ్రత పెరుగుతుంది. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని హెచ్‌ఎం ఎస్. వీరాంజనేయులు నమ్మారు. అందుకనుగుణంగా తన సొంత నిధులు రూ.2.50 లక్షలకుపైగా వెచ్చించి పాచిలవానిపాలెం పాఠశాలను ఆధునికీకరించారు. ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వీరాంజనేయులు 2017లో పాఠశాలకు బదిలీపై వచ్చారు. అప్పటికి ఇక్కడ రెండు తరగతి గదులు ఉండేవి. వీటిలో ఒక భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మరో భవనంలో 18 మంది విద్యార్థులకు 1 నుంచి 5 వరకు తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం శ్లాబ్ పెచ్చులూడటంతోపాటు వర్షం కురిస్తే గోడలు చెమ్మగిల్లేవి. దీంతో హెచ్‌ఎం తన సొంత నిధులు రూ.2.50 లక్షలతో గతేడాది డిసెంబర్‌లో భవన మరమ్మతులు చేశారు. శ్లాబ్‌పై రూఫింగ్, సీలింగ్ పనులను చేపట్టారు. భవనం గోడలు చెమ్మగిల్లడంతో ప్లాస్టింగ్ పనులు, గోడలకు పుట్టీ, కిటికీలు, తలుపులు ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లో టైల్స్, పెయింటింగ్ పనులను చేపట్టి విద్యార్థులను ఆకర్షించేలా భవనాన్ని తీర్చిదిద్దారు. వీటితోపాటు మురుగు, మూత్రశాలల మరమ్మతులు చేపట్టి, వీటికి రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని కల్పించారు.

ఏటా ఏకరూప దుస్తులు పంపిణీ

పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం వీరాంజనేయులు ఏటా సొంత నగదుతో ఏకరూప దుస్తులు కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ యూనిఫాంతోపాటు ప్రతీ శనివారం హెచ్‌ఎం సమకూర్చిన ఏకరూప దుస్తులను ధరించి పాఠశాలకు హాజరవుతున్నారు. అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం నిలిచిపోవడంతో సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. వంగ, బీర, గోంగూర, పాల, చుక్కకూర వంటి ఆకుకూరల పెంపకాన్ని చేపడుతున్నారు. వీటిని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగిస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



నేను ఏడేళ్ల క్రితం పాఠశాలకు వచ్చాను. అప్పట్లో పాఠశాల అధ్వానంగా ఉండేది. నా సంపాదనలో కొంతనైనా వెచ్చించి విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన బోధన అందించాలని సంకల్పించాను. మొత్తానికి పాఠశాలలో అన్ని పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పుడెంతో ఆనందంగా ఉంది.

– ఎస్.వీరాంజనేయులు, హెచ్‌ఎం, ఎంపీపీ పాఠశాల, పాచిలవానిపాలెం

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సంతోష్‌కుమార్

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న వై.సంతోష్‌కుమార్ (38) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి.. పరవాడ ఫార్మాసిటీలో బయోకాన్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సంతోష్‌కుమార్ అనకాపల్లికి చెందిన వాణిని 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వరలక్ష్మి వ్రతం నిమిత్తం వాణి ఆమె కన్నవారింటికి శుక్రవారం వెళ్లింది. శనివారం ఉదయం భర్త సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఎదురింట్లో ఉన్న వారికి ఫోన్ చేసి తన భర్త ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు.. ఇంటికి వెళ్లి ఒకసారి చూడాల్సిందిగా కోరింది. దీంతో సంతోష్‌కుమార్ ఉంటున్న ఇంటికి వెళ్లి కిటికీ లోనుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వాణికి ఆ విషయం చెప్పారు. మృతుడి తండ్రి కృష్ణారావు ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పరవాడ పోలీసులు వెల్లడించారు.

పాఠశాలను కొనసాగించరూ...

నీళ్లబంద, పీత్రుగెడ్డ గిరిజనుల అభ్యర్థన


చేతులెత్తి దణ్ణం పెడుతున్న చిన్నారులతో గిరిజనులు

రోలుగుంట: తమ పిల్లలు చదువుకోవడానికి పాఠశాలను కొనసాగించాలని మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు పీత్రుగెడ్డ, నీళ్లబంద గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. రెండు గ్రామాల్లో బడిఈడు పిల్లలు 12 మంది ఉన్నారు. వీరంతా చదువుకోవాలంటే పది కిలోమీటర్లు దూరాన అర్ల గ్రామానికి వెళ్లాలి. ఆ సమయంలో అటవీ ప్రాంతంలో నడుచుకుని అనేక ఇక్కట్లు ఎదుర్కొంటూ పాఠశాలకు వెళ్లి వచ్చే వరకూ తల్లిదండ్రులు ఆందోళనగా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొనేది. ఈ సమస్యను గతేడాది లోసింగి గ్రామానికి వచ్చిన అప్పటి వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి మొరపెట్టుకోగా, ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఈ విద్యా సంవత్సరం లోసింగిలో పాఠశాల తెరుచుకోలేదు. తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులను గిరిజనులు కోరుతున్నారు. ఉపాధ్యాయులు, వారి సిబ్బంది వచ్చిపోయే వీలుగా శ్రమదానంతో రోడ్డు నిర్మించుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులు కిలో రాజు, మర్రి సన్యాసిరావు తదితరులు తెలిపారు. దీనిపై ఎంఈవో–2ని సంప్రదించగా వచ్చే నెలలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ.50 వేల సాయం


బాధిత కుటుంబ సభ్యుడికి నగదు జమ పత్రాన్ని అందజేస్తున్న ట్రస్టీ ఎల్లేటి కరుణాకర్‌నాయుడు

దేవరాపల్లి: క్యాన్సర్ బాధితురాలికి చైతన్య గొంప చారిటీ ట్రస్టు బాసటగా నిలిచింది. దేవరాపల్లికి చెందిన దుక్క గోవిందలక్ష్మి క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న చైతన్య గొంప చారిటీ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్లేటి కరుణాకర్‌రావు, గొంప ప్రేమ్‌గణేష్, శారదా దంపతులు రూ. 50 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం బాధితురాలి ఖాతాలో జమ చేశారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులకు శనివారం నగదు జమ ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టీ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మహేశ్వరీనాయుడు, గాలి రవికుమార్, గొర్లె దేముళ్లు, కొరుపోలు చంద్రరావు, గంగవంశం సత్తిరాజు, గవిరెడ్డి దేముడునాయుడు, దుక్క సత్తిబాబు, బాబ్జీ పాల్గొన్నారు.

కంచరపాలెం పాలిటెక్నిక్‌కు ప్రతిష్టాత్మక పథకం


ఎఫ్‌డీపీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు, మధుకుమార్

- 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాం'కు ఎంపిక
- రేపటి నుంచి శిక్షణ తరగతులు

మురళీనగర్ : కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఏఐసీటీఈ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమం నిర్వహణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంపికైంది. రాష్ట్రంలోని 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి దరఖాస్తులు రాగా కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సమర్పించిన నివేదికను పరిగణలోకి తీసుకుని ఈ కళాశాలను ఎంపిక చేసింది. 2024–2025 విద్యా సంవత్సరానికి శిక్షణ తరగతులు ఇక్కడ నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు. సోమవారం నుంచి 24వ తేదీ వరకు మొదటి విడత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనే అధ్యాపక సిబ్బందికి ఉత్పత్తుల్లో నాణ్యత నిర్వహణ, లాజిస్టిక్ ఆప్టిమైజేషన్ అమలుతో సహా నాణ్యత నిర్వహణ సూత్రాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారన్నారు. విద్యారంగ నిపుణులు, పరిశ్రమలకు చెందిన వివిధ విభాగాల నిపుణులు పాల్గొని వారం రోజులు మొదటి బ్యాచ్‌కు చెందిన 50 మంది ఫ్యాకల్టీలకు శిక్షణనిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, తులసీరామ్ ఇతర ఫ్యాకల్టీ సభ్యులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు

వైఎస్సార్‌సీపీకి మద్దతుతో జీర్ణించుకోలేని టీడీపీ


చీడికాడ మండలం వరహాపురంలో హెచ్‌ఎంతో టీడీపీ మద్దతుదారు వాగ్వాదం

- ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదం
- పోలీసుల రంగ ప్రవేశం

మాకవరపాలెం: బూరుగుపాలెం ఎస్‌ఎంసీ ఎన్నిక ఉద్రిక్తతకు దారితీసింది. రెండుసార్లు డైరెక్టర్ల ఎన్నిక నిర్వహించగా, మూడోసారి పెట్టాలని టీడీపీ పట్టుబట్టడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కమిటీ ఎన్నిక తాత్కాలికంగా వాయిదా పడింది. పాఠశాలలో 3 నుంచి 10 తరగతులకు శనివారం ఎన్నికలు నిర్వహించగా, 21 మంది డైరెక్టర్లకు గాను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 13 మంది, మిగిలిన టీడీపీ మద్దతుదారులు 8 మందిని ఎన్నుకున్నారు. ఇక 8వ తరగతిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ వర్గీయులు ఒత్తిడితో రెండు సార్లు ఎన్నిక నిర్వహించగా, అందులోనూ వైఎస్సార్‌సీపీకే మద్దతు లభించింది. మూడో సారి ఎన్నికకు పట్టుబట్టడంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఎంఈవో మూర్తి, తహసీల్దార్ ప్రసాద్ సూచన మేరకు ఎన్నికను వాయిదా వేసినట్టు హెచ్‌ఎం నాగేశ్వరరావు ప్రకటించారు.

కావాలనే ఎన్నిక వాయిదా వేశారు...: వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉందనే అక్కసుతో టీడీపీ వాళ్ల ఒత్తిళ్లకు తలొగ్గి ఎన్నిక వాయిదా వేశారని మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, తూటిపాల, బూరుగుపాలెం సర్పంచ్‌లు గవిరెడ్డి ప్రసాద్, వొబ్బలరెడ్డి వెంకటరమణ ఆరోపించారు. కోరం ఉన్నప్పటికీ వాయిదా వేశారని, వారంతా పాఠశాల ఎదుట బైఠాయించి ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. వజ్రగడలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను పోటీ చేయకుండా టీడీపీ వర్గీయులతో ఎన్నిక ఏకపక్షంగా జరిపించారని మాజీ సర్పంచ్ కాళ్ల త్రినాథ్ ఆరోపించారు.

వరహాపురంలో ఎన్నిక అడ్డుకునేందుకు టీడీపీ విశ్వప్రయత్నాలు

చీడికాడ: మండలంలోని జేబీపురం పంచాయతీలో వరహాపురం ఎంపీపీ, ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నేతలు బెదిరింపులకు దిగి అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ముందుగా ఎంపీపీ పాఠశాలలో ఆరు డైరెక్టర్లను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందారు. ఇదే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తే ఉన్నత పాఠశాలలో పరాభావం తప్పదని భావించిన టీడీపీ నేతలు రహస్య బ్యాలెట్‌కు పట్టుబట్టారు. హెచ్‌ఎం వరహామూర్తిని బెదిరించి కాసేపు గలాటా చేశారు. దాంతో భయపడి ఎన్నికను నిలిపివేయగా, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. ఎన్నిక నిర్వహించకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి మిగిలిన తరగతుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. 1, 2 తరగతులున్న ఎంపీపీ పాఠశాల లో 6 డైరెక్టర్లను, 3 నుంచి 10వ తరగతుల వరకు ఉన్న 24 మంది డైరెక్టర్లును వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందారు. ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా పోతుబంతి దుర్గారావు, ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మిస్కా అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముగ్గుర్ని కాపాడిన లైఫ్‌గార్డ్స్


విద్యార్థులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోతుండగా లైఫ్ గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. నగరానికి చెందిన బి. దీపక్, ఎస్.నితిన్, ఎస్.కౌషిక్ శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు బీచ్‌కొచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరు కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సూరాడ నూకరాజు, డి.కార్తిక్, ఎమ్. అప్పోరు గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. విద్యార్థులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సింహాచలం: విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగులకు, వైదికులకు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఉదయం స్వామికి జరిగే సుప్రభాతసేవలోను, తీర్థబిందె పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన వారు వచ్చారో లేదో పరిశీలన జరిపారు. ఒక డోలు విద్వాంసుడు గైర్హాజరు కావడాన్ని గమనించారు. ఉదయం త్రిపురాంతకస్వామి ఆలయం తెరవకపోవడాన్ని గమనించారు. దీంతో ఇరువురికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఏఈవో ఆనంద్‌కుమార్‌ని ఆదేశించారు. కాగా చందనోత్సవం తర్వాత నిలిచిపోయిన తీర్థబిందె సంప్రదాయాన్ని శనివారం నుంచి పునరుద్ధరించారు. ఏటా చందనోత్సవం తర్వాత మూడునెలలపాటు తీర్థబిందెని తీసుకొచ్చే సంప్రదాయాన్ని నిలిపివేసి ఆ తర్వాత పునరుద్ధరిస్తారు.

సిరసపల్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- మునగపాక పోలీసులకు ఫిర్యాదు

మునగపాక: తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టి.సిరసపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొడ్డి కమలాకర్ శనివారం రాత్రి మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు కమలాకర్ కథనం మేరకు.. గ్రామ స్కూల్ కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన కూటమి నేతల మద్దతుదారులు ఊరేగింపు నిర్వహించారు. దీనిలో భాగంగా తాను వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో కూర్చొని ఉండగా, అదే సమయంలో బొడ్డేడ మహేశ్వరరావు తాను ఇక్కడ ఎందుకున్నానని, ఎవరూ పంపించారంటూ తనపై దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. 144 సెక్షన్ అమలులో ఉన్నా, తనను చంపడానికి ప్రయత్నించాడని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

క్లుప్తంగా

నేడు మరిడిమాంబ ఘటాల ఊరేగింపు

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి పండగను ఈ నెల 22న అత్యంతవైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రహరినాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఘటాల ఊరేగింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. 20న సాయంత్రం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, 21న రాత్రి 7 గంటలకు కోట్నివీధి రామాలయం వద్ద అనకాపల్లి గాంధీచౌక్ కళాకారుల సంఘం ఆర్థిక సాయంతో సినీ డూప్స్ హంగామా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆలయ ఆవరణలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 22 వరకు రాఘవేంద్ర గురుసార్వభౌముల 353వ ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి జనార్దనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న సాయంత్రం 5 గంటలకు స్వామివారికి గోపూజ, ధ్వజారోహణం, ప్రార్థనోత్సవం, లక్ష్మీపూజ, ధాన్యపూజ, భజన కార్యక్రమం, మహా మంగళహారతి ఉంటుందన్నారు. 20న సుప్రభాత సేవ, నిర్మాల్య విసర్జన, ఉత్సవ రాయల పాదపూజ, కనకాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, సుందరకాండ పారాయణం, మహా మంగళహారతి, పల్లకీ సేవ, 21న ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, 22న స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి నేతల జోక్యం


తుమ్మపాల హైస్కూల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణలో కూటమి నేతలు

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలను ఆరంభం నుంచి చివరి వరకు కూటమి నేతలు దగ్గరుండి మరీ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనాలి. వేరెవరూ పాఠశాల ఆవరణలో ప్రవేశించేందుకు్కూడా వీల్లేదు. మండలంలోని మిగిలిన చోట్ల చాలా వరకు నిబంధనల మేరకే జరిగినా, తుమ్మపాల హైస్కూల్లో కూటమి నేతలు ఎన్నికలు నిర్వహిస్తుంటే, హెచ్ఎం మద్దతు పలికారు. దీంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ పాల్గొనలేదు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 61 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,940	4,200
మూడోరకం	3,050	3,310

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 366 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వైద్య సేవల్లో మేటి.. తాళ్లపాలెం పీహెచ్‌సీ

- కొత్తగా గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్
- గైనకాలజీ సేవలకు పెరుగుతున్న ఓపీలు
- ల్యాబ్ భవనం పూర్తయితే మరిన్ని పరీక్షలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలు చాలా చోట్ల సత్ఫలితాలిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోకపోయినా గత ప్రభుత్వ చర్యలు మాత్రం రోగుల పాలిట వరంలా మారాయి. ఇందుకు కశింకోట మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో రోగులకు, గర్భిణులకు అందుతున్న మెరుగైన వైద్య సేవలే నిదర్శనం.


కొత్తగా నిర్మిస్తున్న ల్యాబ్ భవనం



తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


గర్భిణికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తున్న గైనకాలజిస్టు


అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు నిరీక్షిస్తున్న గర్భిణులు


అల్ట్రా సౌండ్ స్కాన్ యంత్రం


రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ మహేశ్వరి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో గర్భిణుల కోసం కొత్తగా మినీ అల్ట్రాసౌండ్ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. సుమారు రూ.10 లక్షలు వెచ్చించి దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చి, గత నెల ప్రారంభించారు. ప్రతి నెలా 9వ తేదీన గర్భిణుల(8, 9 మాసాల)కు పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తారు. దీని ద్వారా గర్భస్థ శిశువు అభివృద్ధి, ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటారు. హైరిస్క్ ఉంటే ముందుగానే పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. దీంతో ప్రాణాపాయ స్థితి నుంచి తల్లీ బిడ్డను రక్షించుకునే వీలుంటుంది.

పెరిగిన గైనకాలజీ సేవలు

మాతా శిశు మరణాలను అరికట్టేందుకు ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రతి నెల 9న గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్నారు. గతంలో తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు స్కానింగ్ కోసం అనకాపల్లి, యలమంచిలిలోని ప్రభుత్వ ఆస్పత్రులు లేదా, ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చేది. గత నెలలో జిల్లాలోని 7 పీహెచ్‌సీల్లో చెరో రూ.10 లక్షలు వెచ్చించి ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రతి నెలా 9న యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చెందిన గైనకాలజిస్టు డా.మోనిక ఇక్కడికి వచ్చి, గర్భిణులకు స్కానింగ్ చేసి, గర్భస్థ శిశు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. గత నెలలో 20 మందికి, ఈ నెల 25 మందికి ఈ పరీక్షలు నిర్వహించారు. అల్ట్రా సౌండ్ స్కాన్‌తోపాటు, గైనకాలజిస్టు సేవలు అందుబాటులోకి రావడంతో గర్భిణులు, గైనకాలజీ సమస్యలున్న వారు ఆస్పత్రికి రావడం పెరిగింది. గత నెలలో 84 మంది, ఈ నెల 98 మంది గైనకాలజీ సేవలు పొందారు.

సిబ్బందిని పెంచాలి

పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలందిస్తుండగా, మరొకరు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. 24 గంటల వైద్య సేవలందించే పీహెచ్‌సీగా ఏర్పాటు చేసినప్పటికి సిబ్బంది సంఖ్య పెరగాల్సి ఉంది. ముగ్గురు మాత్రమే స్టాఫ్‌నర్స్‌లున్నారు. వారిలో ఎవరు సెలవు పెట్టినా, వీక్లీఆఫ్ తీసుకున్నా 12 గంటల డ్యూటీ చేయాల్సి వస్తోంది. దీంతో మరో ఇద్దరిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు. పీహెచ్‌సీకి పూర్తిగా ప్రహరీ లేకపోవడంతో పశువులు లోపలికి వస్తున్నాయి. వీటి నివారణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ల్యాబ్ పూర్తయితే మరిన్ని సేవలు

పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షలతో ల్యాబ్ భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నిర్మాణం ఇప్పుడు తుది దశకు చేరుకుంది. తలుపులు, గేట్లు, కిటికీలు వగైరా అమర్చి, రంగులు వేయాల్సి ఉంది. ఇది వినియోగంలోకి వస్తే మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలవుతుంది. యలమంచిలి క్లస్టర్ పరిధిలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఇక్కడే చేపట్టనున్నారు. ఈ భవనాన్ని తాజాగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు.

100కు పైగా ఓపీలు 50కి పైగా రక్త పరీక్షలు

ఈ పీహెచ్‌సీ తాళ్లపాలెం పరిసర గ్రామాలకు కూడలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పీహెచ్‌సీ వైద్యసేవల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగింది. రోజూ సగటున 100కుపైగా రోగులు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. గత ప్రభుత్వంలో ఆస్పత్రికి ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చారు. దీంతో డెంగ్యూ, మలేరియా, ప్లేట్‌లెట్స్, కొలెస్ట్రాల్ తదితర రక్త పరీక్షలు చేస్తున్నారు. రోజుకి కనీసం 50 మంది ల్యాబ్ సేవలు పొందుతున్నారు.

అనకాపల్లి వెళ్లే తిప్పలు తప్పాయి



గతంలో స్కానింగ్ చేయించాలంటే అనకాపల్లి ఆస్పత్రికి పంపించేవాళ్లు. దీంతో అక్కడ తిప్పలు పడలేక ప్రైవేట్ ల్యాబ్‌లో డబ్బులిచ్చి స్కానింగ్ చేయించుకునే వాళ్లం. పీహెచ్‌సీలో స్కానింగ్ మిషన్ అందుబాటులోకి రావడంతో అనకాపల్లి వెళ్లే తిప్పలు తప్పాయి. దీంతో తల్లీ బిడ్డ మరింత క్షేమంగా ఉండేందుకు వీలవుతుంది.

–మడక తులసి, పరవాడపాలెం

అందుబాటులో గైనకాలజీ సేవలు



ప్రతి నెలా పీహెచ్‌సీకి గైనకాలజిస్టు రావడం వల్ల గర్భస్థ పరీక్షలకు వెసులుబాటు కలిగింది. గర్భం దాల్చినప్పటి నుంచి రెగ్యులర్ పరీక్షల కోసం అనకాపల్లి వంటి దూర ప్రాంతాలకు ఆపసోపాలు పడి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బందుల్లేవు. మాకు దగ్గర్లోని తాళ్లపాలెం పీహెచ్‌సీలో ఆ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–పక్కుర్తి మహాలక్ష్మి, ఉగ్గినపాలెం.

వైద్యం బాగా చేస్తున్నారు



నాకు బీపీ ఉంది. అప్పుడప్పుడు కళ్లు తిరుగుతున్నట్లనిపిస్తొంది. అందుకే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకుని, వారిచ్చే మాత్రలు వాడుతున్నాను. మా ఊరికి 104 వాహనం వస్తే వాళ్లే మందులిస్తారు. అది రానపుడు, ఆ సమయంలో నేను లేనపుడు పీహెచ్‌సీకి వచ్చి మందులు తీసుకుంటా. ఇక్కడ వైద్య సేవలు బాగానే అందిస్తున్నారు.

– రెడ్డి అప్పలనాయుడు, చెరకాం గ్రామం

ల్యాబ్‌తో అన్ని రకాల వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో ప్రతి నెల 9న గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తున్నాం. యలమంచిలి నుంచి గైనకాలజిస్టు ప్రత్యేకంగా ఆ రోజు వస్తారు. ల్యాబ్ భవనం అందుబాటులోకి వస్తే యలమంచిలి క్లస్టర్ పరిధిలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడే నిర్వహించవచ్చు. ప్రస్తుతానికి మందులు అందుబాటులో ఉన్నాయి.

–యు.రమేష్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, తాళ్లపాలెం

ఎన్టీఆర్ వైద్యాలయంలో సేవలు బంద్

- జూనియర్ డాక్టర్‌పై అత్యాచార ఘటనకు నిరసనగా ఒక్క రోజు సమ్మె
- అత్యవసర విభాగంలో సేవలు యథాతథం


ప్లకార్డులతో జూనియర్ వైద్యులకు మద్దతు తెలుపుతున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రభుత్వ ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య దారుణానికి నిరసనగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో శనివారం వైద్యసేవలు నిలిపేశారు. ఒక్కరోజు సమ్మెలో భాగంగా వైద్యులు, సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. వీరికి ఆస్పత్రి శాశ్వత ఉద్యోగులతోపాటు, వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మద్దతు తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథాతథంగా కొనసాగాయి. మొత్తం 15 మంది వైద్యుల్లో ఇద్దరు మాత్రం ఈ విభాగంలో సేవలు అందించారు.

పూల్‌బాగ్‌రోడ్డు వరకు ర్యాలీ

ఎన్టీఆర్ వైద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యులు కోల్‌కతా జూనియర్ డాక్టర్ ఘటనపై కేంద్రం త్వరితగతిన స్పందించి, నిందితుల్ని పట్టుకుని, తక్షణమే శిక్ష విధించాలంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. వైద్యాలయం నుంచి పూల్ బాగ్ రోడ్డు వరకు నినాదాలు చేసుకుంటూ, ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు జరగకుండా కేంద్రం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు వైద్యం అందించే డాక్టర్లకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, మిగిలిన వైద్య సిబ్బంది మద్దతు పలికారు.

ఈసురోమన్న రోగులు

ఆస్పత్రిలో సేవలు బంద్ అన్న విషయం తెలియని రోగులు చాలా మంది వైద్యాలయానికి వచ్చారు. వారిలో అత్యవసర వైద్యం అవసరమైన వారు మినహా, మిగిలిన వారికి ఎలాంటి వైద్య సేవలు లభించలేదు. సాయంత్రానికైనా వైద్యులు వస్తారేమోనని దూరప్రాంతాల నుంచి వచ్చిన కొందరు రోగులు ఆశగా ఎదురుచూశారు. అయినా వారికి నిరాశే మిగిలింది. గర్భిణులు, వివిధ సంఘటనల్లో గాయపడ్డవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు సాయంత్రమైనా రాకపోవడంతో ఈసురోమంటూ తమ గ్రామాలకు తిరుగుముఖం పట్టారు.


తాళాలు వేసివున్న అల్ట్రా సౌండ్ స్కానింగ్, జనరల్ ఫిజిషియన్ గదులు


చిన్నపిల్లల వైద్యుని గది వద్ద పిల్లలతో కుటుంబ సభ్యుల నిరీక్షణ

వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసన జ్వాల


కశింకోటలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

కశింకోట: డాక్టర్లు, నర్సులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కశింకోటలో శనివారం పెద్ద ఎత్తున ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీగా బయలుదేరి జాతీయ రహదారిపైకి చేరుకుని కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. డాక్టర్లు, నర్సులపై దాడులను అరికట్టాలని, కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శని, ఆదివారాల్లో పీహెచ్‌సీల్లో అత్యవసర కేసులు తప్ప, మిగిలిన వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారులు తిరుపతిరావు, యు.రమేష్, యశోద, ఎ.మనీషా, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్, సూపర్‌వైజర్ సత్యవతి, విజయలక్ష్మి, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య హేయం


నాలుగురోడ్ల కూడలిలో విద్యార్థుల మానవహారం

తుమ్మపాల: జూనియర్ డాక్టర్ మౌమితపై అత్యాచారం, హత్య ఘటనను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులు కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎ.కృపానంద్ మాట్లాడుతూ దేశంలో విద్యార్థినులు, డాక్టర్లు, టీచర్లు, మహిళలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశఖూరు. మౌమితను దారుణంగా కొట్టి అత్యాచారం చేయడంపై హేయమన్నారు. దేశంలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణమైపోయాయని, ప్రభుత్వాలు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయకపోవడమే కారణమన్నారు. జూనియర్ డాక్టర్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాలేజీలు విడిచిపెట్టే సమయంలో కళాశాల వద్ద పోలీస్ నిఘా పెట్టాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు, కేంద్రంపటిష్ట చర్యలు తీసుకుని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ స్థానిక నాయకులు రాము, మల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

– జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు, విధి నిర్వహణలో ఉండే మహిళా ఉద్యోగుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్-కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో పట్టణంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయ డాక్టర్ల సమ్మెకు తమ యూనియన్ మద్దతు తెలుపుతున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. యూనియన్ నాయకులు వాయిబోయిన శేఖర్, డీసీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశుడు



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని వజ్ర కవచనాలంకృతుని చేసి, పూల మాలలు, తులసీ మాలలతో అలంకరించారు. శ్రావణ మాసం శనివారం పురస్కరించుకుని చేసిన అలంకరణ అనంతరం విష్ణు సహస్ర నామార్చన జరిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి


మొక్క నాటుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: పర్యావరణ పరిక్షణకు అందరూ కృషి చేయాలని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో గోపాలపురం ఎంపీయూపీ పాఠశాలలో శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకుని విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొమ్మోజు సత్యవేణి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి యల్లపు రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నిక

- కూటమి నేతల కుయుక్తులే కారణమని ఆరోపణ

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్లో కోరం లేక స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నిక వాయిదా పడింది. పాఠశాలలో 3 నుంచి 10 వరకు 8 తరగతులున్నాయి. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యుల్ని ఎన్నుకోవాలి. 3, 4 తరగతులకు అవసరమైన మేరకు ఓటర్లుగా తల్లిదండ్రులు రావడంతో చేతులెత్తే విధానంలో సభ్యుల్ని ఎన్నుకున్నారు. వీరిలో నలుగురు వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులు, ఇద్దరు కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన తరగతులకు కోరం మేరకు తల్లిదండ్రుల హాజరు లేదు. దీంతో ఎన్నికల్ని వాయిదా వేశారు. తర్వాత ఎప్పుడు నిర్వహించేదీ ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రకటించనున్నట్లు హెచ్ఎం సునీత, ఎంఈవో-2 మూర్తి మీడియాకు తెలిపారు. కమిటీ చైర్మన్ పదవి వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించే అవకాశం ఉండటంతో కూటమి ప్రతినిధులు కుయుక్తులు పన్ని తల్లిదండ్రులు ఎన్నికలకు రాకుండా చేసినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన నాగేశ్వరరావు ఆరోపించారు. కొత్తపల్లి హైస్కూల్ కమిటీ ఎన్నిక తల్లిదండ్రులు రావడంలో జాప్యం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. నిబంధనల మేరకు ప్రక్రియ పూర్తయింది. వైఎస్సార్‌సీపీ, కూటమి నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గోకివానిపాలెం ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నికలో కూడా జాప్యం నెలకొంది. ఎంఈవో జోక్యంతో ఈ స్కూల్‌తోపాటు, మిగిలిన 55 స్కూల్ కమిటీల ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసింది.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు


గొబ్బూరు ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారు పప్పల రాంబాబు

కశింకోట: మండలంలో శనివారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల్లో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు విజయం సాధించారు. జెట్టపురెడ్డితుని ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్‌గా పశుపునాటి కాసు, రామన్నపాలెం కమిటీ చైర్మన్‌గా పల్లా సత్తిబాబు, వైస్ చైర్మన్‌గా కుండల లక్ష్మి, విసన్నపేట స్కూల్ కమిటీ చైర్మన్‌గా చామంతుల లక్ష్మి, వైస్ చైర్మన్‌గా కొమ్మోజు సౌజన్య, గొబ్బూరు పాఠశాల కమిటీ చైర్మన్‌గా పప్పల రాంబాబు, వైస్ చైర్మన్‌గా ఒమ్మి వరలక్ష్మిలు ఎన్నికయ్యారు. వీరిని స్థానికులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

స్థానికంగా ఉన్న రెండు జిల్లా పరిషత్ హైస్కూళ్ల ఎస్ఎంసీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. బాలికల హైస్కూల్ కమిటీ చైర్మన్ పదవికి ఆళ్ల అశ్వశ్రీనుకుమార్, ఒ.కుమారి పోటీ పడ్డారు. స్థానికుల జోక్యంతో అశ్వశ్రీనుకుమార్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయనకు చేతులెత్తు విధానం ద్వారా సభ్యులు మద్దతు తెలపడంతో, హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి అధికారికంగా ఆయన్ని విజేతగా ప్రకటించారు. వైస్ చైర్మన్‌గా కుమారి ఎన్నికయ్యారు.

డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా నక్కా నాగమణి, వైస్ చైర్మన్‌గా బర్ల దుర్గఅప్పారావు ఎన్నికయ్యారు. హెచ్ఎం ఆచంట రవి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది సహకారం అందించారు.

5న ఎన్టీపీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సెప్టెంబర్ 5న జరిగే గుర్తింపు సంఘ ఎన్నికలకు శనివారం నామినేషన్లు స్వీకరించారు. ఐఎన్‌టీయూసీ మజ్దూర్ యూనియన్ తరఫున జనరల్ సెక్రటరీగా బొండా భీమ్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంజేపీ లెనిన్, కార్యవర్గ సభ్యులతో కలిసి ఎన్నికలఅధికారి బీబీ పాత్రకు నామినేషన్ పత్రాలను అందించారు.